సాక్షి నిర్మల్

శనివారం ၊ 29 ၊ జూలై ၊ 2023

విధుల్లో చేరిన అదనపు కలెక్టర్



నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఎల్.కిశోర్‌కుమార్ శుక్రవారం విధుల్లో చేరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్డీవో



నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ నూతన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రత్నకల్యాణి సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ వరుణ్‌రెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అంకితభావంతో పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
29.5 /24.2

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వరద నష్టంపై సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన నష్టంపై సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. బాధితులకు అండగా ఉండాలని సూచించారు. నష్టానికి సంబంధించిన నివేదిక అందించాలని పేర్కొన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేకాధికారి పర్యటన

భైంసాటౌన్: అధిక వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రత్యేకాధికారి, ఎక్సైజ్ శాఖ కమిషనర్ ముషరఫ్ అలీ శుక్రవారం భైంసా పట్టణాన్ని సందర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. రాహుల్‌నగర్, ఆటోనగర్, ఆర్టీసీ డిపో, భట్టిగల్లి తదితర ప్రాంతాలను పరిశీలించారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టును సందర్శించారు.

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందికి సూచనలిస్తున్న వైద్యాధికారి ధనరాజ్

దస్తురాబాద్/పెంబి: గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కి భారీగా వరదనీరు రావడంతో అంటువ్యాధులు ప్రబలే ఆవకాశం ఉందని, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ధనరాజ్ సూచించారు. దస్తురాబాద్, పెంబి మండలాల్లో శుక్రవారం పర్యటించారు. భూత్కూర్ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని సందర్శించారు. పెంబి పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని సూచించారు. ఇంటి పరిసరా లను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆశ వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి అనారోగ్యం బారిన పడినవారి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత ఆరోగ్య అధికారికి తెలియజేయాలన్నారు. గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించడంతోపాటు రోగాల బారిన పడినవారికి తగిన మందులు ఇవ్వాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల్, పీహెచ్‌సీ డాక్టర్లు కామేశ్వర్, నాగరాజు, చందన, సూపర్‌వైజర్ ప్రేమలత, హెచ్‌ఎస్ సోము, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దస్తురాబాద్: గోదావరి తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈవో సుధీర్ బాబు సూచించారు. మండలంలోని మున్యాల, దేవునిగూడెం, గోడిసిర్యాల గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు కడెం, ఎస్సారెస్పీ జలశయాలకు భారీగా వరద వస్తుందన్నారు. వరదను గోదావరిలోకి విడుదల చేస్తున్నందున పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జెడ్పీ సీఈవో వెంట ఎంపీపీ సింగరి కిషన్, ఎంపీడీవో విజయ్‌భాస్కర్ రెడ్డి, ఎంపీవో అనిల్, ఆయా సర్పంచులు శంకర్, అంజన్న నాయకులు ఉన్నారు.

ఈజీఎస్ నిధులతో 'కడెం' వరకు రోడ్డు

కడెం: కడెం ప్రాజెక్ట్ వరదలతో అతలాకుతలం కావడంతో.. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్డీవో విజయలక్ష్మి రెండు రోజులుగా పరిస్థితిని సమీక్షించారు. శుక్రవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. బోటింగ్ పా యింట్ నుంచి గేజ్ రూం వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని, రోడ్డు గుంతలమయమైంది. ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు.

ఎస్ఈని నిలదీసిన కాంగ్రెస్ నాయకులు

కడెం: ఏడాది కాలంగా కడెం ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు ఎందుకు చేయించలేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు ప్రశ్నించారు. ప్రాజెక్ట్‌ను శుక్రవారం సందర్శించిన కాంగ్రెస్ నాయకులు అక్కడే ఉన్న ఎస్ ఈ సుశీల్‌కుమార్‌ను నిలదీశారు. ప్రాజెక్ట్ నిర్వహణను పట్టించుకోకుండా అధికారులు ప్రజ ల ప్రాణాలతో చెలగాటమడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశ్, నాయకులు వాజీద్‌ఖాన్, భూషణం, రాజన్న ఉన్నారు.

శాంతించిన సుద్దవాగు

భైంసాటౌన్: భైంసాలోని సుద్దవాగు శుక్రవారం పూర్తిగా శాంతించింది. సుద్దవాగుపై నిర్మించిన గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద తగ్గడంతో ప్రాజెక్టు అధికారులు నీటి విడుదల తగ్గిస్తూ వచ్చారు. ఉదయం రెండు గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేసిన అధికారులు 8 గంటల తర్వాత గేట్లు పూర్తిగా మూసివేశారు.

ఏదీ అభయం?

- దడ పుట్టిస్తున్న కడెం
- దిగువను ముంచేస్తున్న స్వర్ణ
- భైంసాను భయపెడుతున్న గడ్డెన్న
- జలసంద్రమవుతున్న జిల్లాకేంద్రం
- కొట్టుకుపోతున్న 'ముందుజాగ్రత్తలు'
- ఇంకెన్నాళ్లిలా.. అంటున్న జిల్లా వాసులు



గురువారం వరద నీటిలో నిర్మల్ జిల్లా కేంద్రంలోని జీఎస్‌ఆర్ కాలనీ..



ఇల్లు శుభ్రం చేసుకుంటున్న జీఎస్‌ఆర్ కాలనీ వాసులు



గురువారం భైంసా ఆర్టీసీ డిపోలోకి వచ్చిన వరద



మలక్‌చించోలిలో కోతకు గురైన రోడ్డు

నిర్మల్: ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న భయాందోళన.. ఇళ్లువాకిలి, గొడ్డుగోదా అన్నీ నీళ్లకొదిలి.. ఎక్కడికో వెళ్లాల్సిన దుస్థితి.. క్షణక్షణం ప్రాణాలు గుప్పిటపెట్టుకుని.. 'దేవుడా.. నువ్వే దిక్కు..' అని నిద్రలేని రాత్రులు గడపాల్సిన కష్టం.. ఇలా ఇంకెన్నాళ్లు..? అని వరద బాధితులు వాపోతున్నారు. జిల్లాలో భైంసా సుద్దవాగు నుంచి కడెం ప్రాజెక్టు దాకా ప్రతీ సీజన్‌లో వరదలతో భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లా కేంద్రమూ ఇందుకు మినహాయింపు కాదు. మూడేళ్లుగా నిర్మల్ కూడా నీటమునుగుతూనే ఉంది. ప్రజలు పడుతున్న ఈ కష్టాన్ని ప్రకృతి విపత్తు కింద కొట్టిపారేస్తూ.. పలకరింపులతో, కంటితుడుపు చర్యలతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. ఏటా.. ఈ వరదలు ముంచుతున్నా ముందస్తు చర్యలు లేవని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

'గడ్డెన్న'ఒడ్డు కింద..

భైంసా పట్టణానికి వరప్రదాయినిగా ఉన్న సుద్దవాగుపై గల గడ్డెన్నవాగు ప్రాజెక్టు కూడా మూడేళ్లుగా దుఃఖదాయినిగా మారుతోంది. లోతట్టు ప్రాంతాలను ముంచేస్తోంది. ప్రధానంగా రెడ్‌జోన్‌లో నిర్మాణాలు ఉండటం, పలు కాలనీలు లోతట్టుగా మారడంతో ముంపు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం ఒక్కసారిగా వరద విరుచుకుపడటంతో ప్రాజెక్టు గేట్లను ఎత్తాల్సి వచ్చింది. దిగువకు ఉప్పొంగిన సుద్దవాగు కాలనీలను ముంచేసింది. ఊహించని ఈ ఘటనతో స్థానికులు హాహాకారాలు పెట్టారు. అధికార యంత్రాంగం ప్రమాదకర పరిస్థితుల నుంచి వారిని కాపాడాల్సి వచ్చింది. ఈసారీ ముంపు తప్పలేదు. కాలనీలతో పాటు ఇప్పుడు భైంసా ఆర్టీసీ డిపో సైతం మునిగిపోయింది. ఆఫీస్‌తోపాటు బస్సులు సైతం సగం వరకు నీట మునిగాయి. రెండురోజులైనా ఆయా కాలనీలు, ఆర్టీసీ కార్యాలయం తేరుకోవడం లేదు.

జలసంద్రంలో జిల్లాకేంద్రం..

పేరుకు జిల్లా కేంద్రమైనా నిర్మల్ సైతం మూడేళ్లుగా నీళ్లలో మునగక తప్పడం లేదు. 2021 జులైలో కనీవిని ఎరుగని రీతిలో స్వర్ణ ప్రాజెక్టు నీళ్లు శివారు కాలనీలను ముంచెత్తాయి. సిద్ధాపూర్‌తోపాటు పక్కనే ఉన్న జీఎస్‌ఆర్ కాలనీ మొత్తం జలసంద్రంగా మారింది. వేకువజామునే చుట్టుముట్టిన వరదలో ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకుని రెండతస్తుల ఇళ్లపై కెక్కారు. స్థానికులు, గంగపుత్రులు థర్మకోల్ పడవల్లో వెళ్లి ఒక్కొక్కరినీ తీసుకువస్తూ ప్రాణాలను కాపాడారు. అదే సమయంలో జిల్లాకేంద్రంలోని శివాజీ చౌక్, డాక్టర్స్‌లైన్, వైఎస్‌ఆర్‌కాలనీ, ప్రియదర్శినినగర్, శాస్త్రినగర్, ఇంద్రానగర్, రవినగర్, భైంసారోడ్డు ఇలా పలు వీధులూ జలమయమయ్యాయి. ఇదే దుస్థితి 2022 జులైతోపాటు తాజాగా గురువారం కూడా ఎదురైంది. రోడ్లు మొత్తం కాలువల్లా మారాయి. ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ఇళ్లల్లోకి నీళ్లతో పాటు చేపలు, పాములూ వచ్చాయి.

కడెం.. గుండె దడ..



ఏడాది తిరగకముందే అదే భయం మళ్లీ వెంటాడింది. అంతా అనుకున్నట్లే.. ఈసారీ కడెం ప్రాజెక్టు గుండెదడ పెట్టించింది. గతేడాది ఇదే జులై 13న దాదాపు 6 లక్షల క్యూసెక్కులతో ప్రాజెక్టును నిండా ముంచుతూ జలప్రళయం ఉప్పొంగింది. ఊరువాడా, చెట్టుచేమా.. అన్ని జలమయమయ్యాయి. లెక్కలేనంత పంటనష్టం జరిగింది. క్షణక్షణం ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని గడపాల్సి వచ్చింది. వారాల తరబడి కోలుకోలేక అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటిది మళ్లీ రావద్దు దేవుడా.. అని ఇక్కడి ప్రాంతమంతా చేతులెత్తి మొక్కుకుంది. అంతటి ప్రవాహాన్ని తట్టుకుని ప్రజల ప్రాణాలకు ఆనకట్ట అడ్డుగా నిలిచింది. కానీ.. పాలన, అధికార యంత్రాంగాలు మాత్రం పాఠాలు నేర్వలేదు. యంత్రాంగం లోపాల కారణంగానే ఏడాదికే మళ్లీ అదే భయం కడెంను వెంటాడిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈనెల 26 అర్ధరాత్రి నుంచి 27న రోజంతా 3 లక్షలకుపైగా క్యూసెక్కుల వరద వచ్చిపడింది. నాలుగు గేట్లు మొరాయించడంతో గేట్ల పైనుంచి వరద పారింది. గత ఏడాదే భారీగా దెబ్బతిన్న కడెం ప్రాజెక్టు ఈసారి తట్టుకుంటుందా..? అన్న భయాందోళనతో గడపాల్సి వచ్చింది.

ఇంకెన్నేళ్లిలా..

2021.. అప్పుడేదో అవగాహన లేకపోవడం, ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో జరిగింది.

2022.. ముందస్తు చర్యలు తీసుకునేందుకు సమయం కూడా లేకపోవడం, ఊహించనంతగా వరద రావడంతో ఏం చేయలేకపోయాం. మరి..

2023లో కూడా అదే దుస్థితి ఎందుకు ఎదురైంది..? ఈ ప్రశ్నకు ఇప్పటి వరకైతే సమాధానం రావడం లేదు. ఈసారి ముందుజాగ్రత్త చర్యలు చేపట్టినట్లు జిల్లా యంత్రాంగం చెబుతున్నా.. వాటి ఆనవాళ్లు కూడా కనిపించలేదు. ప్రాజెక్టుల మరమ్మతులు, ఎగువ నుంచి వచ్చే వరద అంచనా, దిగువన ముందే అలర్ట్ చేయకపోవడం, జిల్లాకేంద్రంలో ఆక్రమణలను తొలగించలేకపోవడం, తూతూమంత్రంగా పనులు చేయడం.. ఇలా పాతకారణాలే ఈ ఏడాదీ జిల్లాను ముంచేశాయి. ప్రజలకు ఈసారీ వరద, బురద కష్టాలను మిగిల్చాయన్న ఆరోపణలున్నాయి.

భయం భయంగానే..



కడెం ప్రాజెక్టుకు వరద వస్తుందంటేనే భయపడాల్సి వస్తోంది. ప్రాజెక్టు సైరన్ మోగితే ఇక్కడ అందరికీ గుండెదడ మొదలవుతోంది. ఎప్పుడు, ఏమవుతుందోనని ఆందోళన చెందాల్సి వస్తోంది.

– యశోద, కడెం

ఏటా ఇదే కథ..



జిల్లాకేంద్రమైనా వానాకాలమొస్తే భయపడాల్సి వస్తోంది. మెయిన్ రోడ్లే నిండా మునుగుతున్నాయి. ఇష్టారీతిన చేస్తున్న ఆక్రమణలను తొలగించకపోవడం, ఇప్పటికీ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం దారుణం.

– పోశెట్టి, నిర్మల్

లక్ష రూపాయలు కనిపించడం లేదు...



నిర్మల్‌చైన్‌గేట్: క్రాప్ లోన్ నిమిత్తం బ్యాంకు నుంచి తీసుకువచ్చిన లక్ష రూపాయలు ఇంట్లో భద్రపరిచాము. అకాల వర్షాల వలన వచ్చిన వరదలతో దాచుకున్న డబ్బులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. దీంతోపాటు ఎలక్ట్రానిక్ సామగ్రి కూడా పనికి రాకుండా పోయింది.

– భోజన్న, ప్రయివేట్ ఉద్యోగి

చెక్ డ్యామ్‌లే కారణం...



నిర్మల్‌చైన్‌గేట్: గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడు సంవత్సరాల నుంచి మా కాలనీకి వరద వచ్చి చేరుతుంది. కాలనీకి దిగువ నీటి ప్రవాహానికి అడ్డంగా నిర్మించిన చెక్ డ్యాములే తరచూ అకాల వరదలకు కారణం అవుతున్నాయి. అధికారులు స్పందించి మా సమస్యను పరిష్కరించాలి.

– రాజ్ కుమార్, జీఎస్‌ఆర్ కాలనీ

మూడేళ్లుగా ఇదే తంతు...



నిర్మల్‌చైన్‌గేట్: మూడేళ్లుగా మా కాలనీని వరదలు ముంచెత్తుతున్నాయి. అనేక రకాలుగా నష్టపోతున్నాం. నిత్యావసర సరుకులతోపాటు మా పిల్లల స్కూల్ బుక్స్ కూడా వరదల్లో కొట్టుకుపోయాయి. లక్ష రూపాయల విలువ గల టీవీతోపాటు, రూ.2 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ సామగ్రి పాడైంది.

– సగ్గం నిరోషా, జీఎస్‌ఆర్ కాలనీ

తేలుతున్న పంట నష్టం లెక్క..

లక్ష్మణచాంద: రెండు రోజులు కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. పత్తి, మొక్కజొన్న, సోయా మొక్కలు కొట్టుకుపోయాయి. చేలల్లో ఇసుక, మట్టి మేటలు వేసింది. వ్యవసాయాధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. లక్ష్మణచాంద మండలంలో 617 ఎకరాలలో పంటల నష్టం జరిగినట్లు మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. కనకాపూర్, పీచర, లక్ష్మణచాంద క్లస్టర్ల పరిధిలో 51 మంది రైతులకు చెందిన 251 ఎకరాల్లో పత్తి, 34 మంది రైతులకు చెందిన 120 ఎకరాల పసుపు, 42 మందికి రైతులకు చెందిన 190 ఎకరాల్లో సోయా, 29 మందికి చెందిన 56 ఎకరాలలో వరి నష్టపోయినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లుగా వివరించారు.

సోన్ మండలంలో....

సోన్ మండలంలో మొత్తం 945 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. ఇందులో మొక్కజొన్న 740 ఎకరాలలో సోయా 25 ఎకరాలు, పసుపు 120 ఎకరాలు, కంది 60 ఎకరాలలో మొత్తం 945 ఎకరాలలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

లోకేశ్వరం మండలంలో..

లోకేశ్వరం: ఎడతెపిరి లేకుండా కురిసిన భారీ వర్షాలకు, గడ్డెన్న వాగు ప్రాజెక్టు ఉధృతికి మండలంలోని పుస్పూర్, బిలోలి, సాథ్‌గాం , హవర్గ, హద్గాం , మన్మద్ తదిరత గ్రామాల్లో 1,520 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ఏవో గణేష్ తెలిపారు. 390 రైతులకు చెందిన 710 ఎకరాల్లో పత్తి, 410 రైతులకు చెందిన 740 ఎకరాల్లో సోయా, 35 మంది రైతులకు చెందిన 70 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు వివరించారు.

తానూరు మండలంలో..

తానూరు : మండలంలోని హిప్నెల్లి చెరువుకు గండిపడి ఆయకట్టు కింద వేసిన పంటలు కొట్టుకుపోయాయి. సుమారుగా 120 ఎకరాల్లోకి వరద నీరు చేరిందని అధికారులు తెలిపారు. మండల వ్యాప్తంగా 2,104 ఎకరాల్లో పత్తి, 3,033 ఎకరాల్లో సోయా, ఇతర పంటలు 340 ఎకరాల్లో నష్టం జరిగిందని వ్యవసాయ అధికారి గణేశ్ తెలిపారు.



నష్టపోయాం.. ఆదుకోండి..



రోడ్డుపై బైఠాయించిన రైతులు

భైంసా: సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు తెగి తీవ్రంగా నష్టపోయామని, తమను ఎవరూ పట్టించుకోవడంలేదంటూ ఇలేగాం రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో భైంసా – బాసర జాతీయ రహదారిపై దేగాం వద్ద బైఠాయించారు. కలెక్టర్, ఎమ్మెల్యే వచ్చే వరకు కదిలేదిలేదని కూర్చున్నారు. రెండు చెరువులు తెగి 450 ఎకరాల్లో బండరాళ్లు, ఇసుక మేటలు వేశాయని తెలిపారు. గురువారం నుంచి ఊరిలో కరెంటు లేక, తాగేందుకు నీరు కూడా లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. 20 ట్రాన్స్ ఫార్మర్లు, 100కుపైగా విద్యుత్ స్తంభాలు నీటిలో కొట్టుకుపోయాయని సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్ నిరసనకారులతో చర్చించి శాంతింపజేశారు. బాధిత రైతులతో కలిసి నష్టాన్ని పరిశీలించారు. పరిస్థితిని అధికారులకు నివేదిస్తామన్నారు. అనంతరం బాధిత రైతులు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

బోల్సాలో కలెక్టర్ పర్యటన



బోల్సా గ్రామంలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే..

తానూరు: భారీ వర్షం, వరదలకు ముంపునకు గురైన బోల్సా గ్రామంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. నీట మునిగిన ఇళ్లను, కొతకు గురైన రోడ్లను పరిశీలించారు. వరదలతో నష్టపోయిన బాధితుల వివరాలు సేకరించి వారికి పరిహారం అందేలా చూస్తామన్నారు. విద్యుత్ సరఫరాను త్వరగా పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. ముంపు బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ కొతకు గురైన రోడ్లుకు మరమ్మతు చేపట్టేలా చూస్తామని తెలిపారు. సంబంధిత అధికారులతో పంట నష్టం సర్వే నిర్వహించి బాధితులకు పరిహారం అందేలా చూస్తామన్నారు. వారివెంట డీఎల్‌పీవో శివకృష్ణ , మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, నాయకులు పోతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గోపీనాథ్, గ్రామస్తులు ఉన్నారు.

భారీ వాహనాలను అనుమతించొద్దు

లోకేశ్వరం: అర్లి వంతెన నుంచి భారీ వాహనాలను అనుమతించొద్దని కలెక్టరు వరుణ్‌రెడ్డి సూచించారు. హవర్గ గ్రామ సమీపంలోని అర్లి వంతెనను శుక్రవారం పరిశీలించారు. వంతెనకు వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు. సుద్దవాగు పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సోలమాన్‌రాజ్, విద్యుత్ ఏఈ శివకుమార్, ఆర్ ఆండ్‌బీ డీఈ కొండయ్య, స్థానిక సర్పంచ్ భూజంగ్ రావు ఉన్నారు.

వరద బాధితుల కోసం ఎయిర్ బోట్స్

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్



ఎయిర్ బోట్‌లో కలెక్టర్, ఎస్పీ

నిర్మల్‌టౌన్: వరద నీటిలో చిక్కుకున్న బాధితులను సులువుగా రక్షించేందుకు ఎయిర్ బోట్స్ ఎంతగానో ఉపయోగపడతాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రెస్క్యూ సిబ్బందికి జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ చెరువులో ఎయిర్ బోట్స్ శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ, గడ్డన్న ప్రాజెక్టులు దాదాపు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నట్లు తెలిపారు. వరదలతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు రోడ్లు కూడా ధ్వంసమయ్యాయన్నారు. మరోవైపు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిన్నటి వరకు సుమారు 210 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని పేర్కొన్నారు. భైంసా డివిజన్‌లో చాలా మందిని పోలీస్ శాఖ ద్వారా రెస్క్యూ చేశామని వెల్లడించారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్న సుమారు 60 మందిని పోలీసులు ప్రాణాలు పణంగా పెట్టి, రోప్‌తో, లైఫ్ జాకెట్స్‌తో కాపాడారని వివరించారు. ఎయిర్ బోట్స్ ఉంటే ఇంకా సులువుగా, సిబ్బందికి కష్టం కలగకుండా కాపాడవచ్చన్నారు. ఎస్పీ, పోలీస్ శాఖతో చర్చించి, ఎయిర్ బోట్స్ శిక్షణకు నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. దీంతో ఎయిర్ బోట్స్, లైఫ్ జాకెట్లు రోప్స్ తెప్పించామన్నారు. అనంతరం ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్ మాట్లాడుతూ.. నిర్మల్ జిల్లాలో అతి భారీ వర్షాల వల్ల వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు ఎయిర్ బోట్స్, లైఫ్ జాకెట్లు, రోప్స్ కొనడానికి సహకరించిన కలెక్టర్‌కు పోలీస్ శాఖ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. ప్రజలను మరింత సురక్షితంగా కాపాడలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పట్టణ సీఐ పురుషోత్తం, ఆర్ఐలు రమేశ్, రామకృష్ణ, ఎంపీవో వినోద్, ఆర్ఎస్ఐలు సాయికిరణ్, రవికుమార్, దేవేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పులుల సంరక్షణ అందరి బాధ్యత

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- నేడు ప్రపంచ పులుల దినోత్సవం

నిర్మల్‌టౌన్: జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారంగా నిలుస్తున్న పులులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ నెల 29న ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శుక్రవారం మాట్లాడారు. మన పర్యావరణ వ్యవస్థలలో పులులు పోషించే కీలక పాత్రను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. పెద్దపులి అంటే శక్తి, అందం చిహ్నాలు మాత్రమే కాదని, అవి ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు సహాయపడే కీస్టోన్ జాతులని తెలిపారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఒక పులి మీద అడవి, పర్యావరణం, ప్రకృతి, జంతుజాలం, గడ్డి భూములు, జీవవైవిధ్యం వంటివి ఆధారపడి ఉన్నందున పులుల మనుగడ అనేది మానవాళి మనుగడకు కూడా ప్రధానమన్న విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు.

అవగాహన కల్పించాలి..

పెద్ద పులులను సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు, వారిని భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఏటా జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపులుల సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్(ఏటీఆర్), కవ్వాల్ టైగర్ రిజర్వ్ (కేటీఆర్)లో పులుల సంఖ్య పెరుగుతోందన్నారు. మేనేజ్‌మెంట్ ఎఫెక్టివ్‌నెస్ ఎవాల్యుయేషన్ (ఎంఈఈ) నివేదికలో టైగర్ రిజర్వుల నిర్వహణలో రాష్ట్రానికి చెందిన అమ్రాబాద్ 78.7 శాతం స్కోర్‌తో వెరీగుడ్ కేటగిరీలో కవ్వాల్ 74.2 శాతం స్కోర్ సాధించాయని తెలిపారు. తెలంగాణలో మెరుగైన అటవీ విస్తరణ, వేటకు తగిన సంఖ్యలో జంతువులు, నీటివనరులు ఉండడంతో పొరుగున మహారాష్ట్రలోని తిప్పేశ్వర్, తడోబా నుంచి పులులు రాష్ట్రంలోకి వస్తున్నాయని తెలిపారు.

సంఘర్షణ నివారణకు చర్యలు..

వన్యప్రాణులు – మానవుల మధ్య సంఘర్షణ నివారించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. పులుల భద్రత, వాటి సహజ ఆవాసాల సమీప ప్రాంతాలలో నివసించే ప్రజల శ్రేయస్సుకు ప్రాధాన్యమిచ్చేలా టైగర్ ప్రాజెక్ట్‌ను పునరావిష్కరించుకునే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. అటవీ ఆవాసాల పునరుద్ధరణలో భాగంగా కోర్ ఏరియాలోని గ్రామాల తరలింపు వేగవంతం చేశామని తెలిపారు. కవ్వాల్ కోర్ ఏరియాలో ఉన్న రాంపూర్, మైసంపేట గ్రామాలకు చెందిన 142 కుటుంబాలకు పునారావాస ప్యాకేజీ కల్పించి రిలోకేట్ చేశామన్నారు.

క్లుప్తంగా

వాగులో ఒకరి గల్లంతు

సిరికొండ: మండలంలోని కన్నాపూర్ గ్రామ సమీపంలో చిక్‌మాన్ వాగులో ఓ వ్యక్తి గల్లంతైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని వాయిపేట్ గ్రామానికి చెందిన సంగం గంగాధర్(52) గురువారం ఇంద్రవెల్లి మండలంలోని గోపాల్‌పూర్‌లో ఉండే తన కుమారుడి ఇంటికి బయలుదేరాడు. చిక్‌మాన్ వాగు దాటే క్రమంలో గల్లంతయ్యాడు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆచూకీ కోసం శుక్రవారం సాయంత్రం వరకూ గాలించినా ఆచూకీ కానరాలేదు.

అనుమానాస్పదంగా ఆటో డ్రైవర్ మృతి


నవీన్(ఫైల్)

కుంటాల: ఆటో డ్రైవర్ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన బండారి నవీన్(35) శుక్రవారం ఉదయం ఆటో తీసుకొని బస్టాండ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన అల్లకొండ శ్రీనివాస్‌కు చెందిన కారు స్టార్ట్ కాకపోవడంతో కారును నెట్టి క్రమంలో అదుపుతప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. నవీన్ అనుమానాస్పదంగా మృతిచెందాడని, మృతదేహాన్ని పోస్టుమార్టం పంపాలని భార్య స్వప్నతో పాటు మృతుడి బంధువులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు.

ఎఫ్ఎస్‌వోపై దాడి చేసిన ఇద్దరిపై కేసు


గాయపడిన నర్సయ్య

ఇంద్రవెల్లి: ఎఫ్ఎస్‌వో నర్సయ్యపై దాడిచేసి గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డి.సునీల్ శుక్రవారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని ఇంద్రవెల్లి సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఎం.నర్సయ్య, ఎఫ్‌బీవో జోత్స్నదేవితో కలిసి శుక్రవారం అటవీ ప్రాంతంలో వెదురు బొంగు మొక్కలు నాటేందుకు బుర్సన్‌పటర్ గ్రామానికి చెందిన సోన్‌కాంబ్లే విలాస్ వ్యవసాయ చేను పక్కన (దూర) నుంచి ట్రాక్టర్ ద్వారా మొక్కలను తరలిస్తుండగా సోన్‌కాంబ్లే విలాస్, అతడి కొడుకు సోన్‌కాంబ్లే సందర్శ్‌లు అసభ్యకరంగా దూషించడంతో పాటు రాళ్లతో దాడి చేశారు. అంతటితో ఆగకుండా కర్రతో తలపై కొట్టగా గాయమైంది. వెంటనే తోటి సిబ్బంది మండల కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఎఫ్ఎస్‌వో ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


నర్సాపూర్(జి): తిమ్మాపూర్(జి)లో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఈవో గణేశ్


నర్సాపూర్(జి): వర్షాలకు దెబ్బతిన్న నందన్ ఎక్స్‌రోడ్డు


లోకేశ్వరం: అర్లి వంతెనను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్

ఎటుచూసినా నష్టమే...

నర్సాపూర్(జి): గురువారం కురిసిన భారీ వర్షంతో పంటలు, రోడ్లు కోతకు గురికాగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండలంలోని నర్సాపూర్(జి), నందన్, బామిని(బి), గొల్లమాడ, తిమ్మాపూర్(జి), బూర్గుపల్లి(జి), రాంపూర్, టెంబరేణి, చాక్‌పల్లి గ్రామాల్లో పత్తి 330 ఎకరాలు, సోయాబీన్ 100 ఎకరాలు, వరి 168ఎకరాలు, పసుపు 27ఎకరాలు, కంది 50 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఏవో జాదవ్‌సాయి కిరణ్, ఏఈవో గణేష్ పేర్కొన్నారు. గొల్లమాడ గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాల్లో తొమ్మిది విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఏఈ శివ ప్రసాద్ శుక్రవారం పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ దగ్గర రోడ్డు కోతకు గురైంది. నందన్ ఎక్స్‌రోడ్డు వద్ద బీటీ రహదారి కోతకు గురికాగా ఎంపీడీవో అల్లాడి వనజ శుక్రవారం పరిశీలించారు.


భైంసా/భైంసారూరల్: తెగిపోయిన సిరాల ప్రాజెక్టు కట్ట

అర్లి వంతెనపై రాకపోకలు బంద్


కూలడానికి సిద్ధంగా అర్లి వంతెన

లోకేశ్వరం: కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని ప్రాజెక్టులు నిండి పొంగిపొర్లుతున్నాయి. గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తివేయడంతో వరద ఉధృతికి దిగువ ఉన్న మండలంలోని హవర్గ గ్రామ సమీపంలోని హవర్గ – అర్లి గ్రామాల వంతెన కోతకు గురై ముందు భాగం కూలిపోవడంతో వంతెనకు బిగించిన బెడ్ వంగిపోయింది. దీంతో అధికారులు గమనించి రాకపోకలు నిలిపివేశారు. కూలీన అర్లి వంతెనను ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్, ఈఈ అశోక్‌కుమార్, డీఈ కొండయ్య, లోకేశ్వరం తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సోలమన్‌రాజ్, ఎస్సై సాయికుమార్‌లు పరిశీలించారు. అర్లి వంతెన మీదుగా వాహనాలు ప్రయాణించకూడదని గ్రామాల్లో చాటింపు వేశారు. అర్లి వంతెనకు నిధులు మంజూరు చేసి తాత్కాలిక మరమ్మతులు చేపడుతామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ రాజేందర్ పేర్కొన్నారు. మరమ్మతులు పూర్తయ్యే వరకూ రాకపోకలు బంద్ చేసినట్లు తెలిపారు.

మళ్లీ కూలిన వైకుంఠధామం ప్రహరీ


దెబ్బతిన్న ప్రహరీ, సీసీ ఫ్లోరింగ్

భైంసాటౌన్: గడ్డెన్నవాగు ప్రాజెక్టు వరదనీటి ధాటికి రాహుల్‌నగర్‌లోని ఆధునిక వైకుంఠధామం ప్రహరీ మరోసారి కూలింది. గురువారం ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదలడంతో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. దీంతో దిగువన సాత్‌పూల్ సమీపంలోని వైకుంఠధామం ఆనవాళ్లు కోల్పోయింది. గతంలో పాక్షికంగా కూలిన ప్రహరీని ఇటీవల రూ.5లక్షలతో నిర్మించారు. ప్రస్తుతం మరోమారు కూలడంతో ప్రజాధనం నీళ్లపాలైనట్లయింది. దీనికితోడు వరద ఉధృతికి వైకుంఠధామంలోని దింపుడు గద్దె కొద్దిదూరం కొట్టుకుపోగా సీసీ ఫ్లోరింగ్ కొట్టుకుపోయింది.


కొట్టుకొచ్చిన దింపుడు గద్దె

సిరాల కొట్టుకుపోయింది

- ఊరంతా మహదేవ్ మందిరంలో
- రామస్వామి గుడి కనుమరుగు
- వేల ఎకరాల్లో పంట నష్టం
- మూడుచోట్ల తెగిన ఆయకట్టు

భైంసా/భైంసారూరల్: భారీ వర్షాలకు సిరాల ప్రాజెక్టు ప్రధాన ఆయకట్టు తెగి నీరంతా ఖాళీ అయ్యింది. గురువారం సాయంత్రం భారీగా ప్రాజెక్టులోకి నీరుచేరింది. ఆయకట్టుపై నుంచి నీరు కిందికి రావడంతో గమనించిన గ్రామస్తులంతా పక్కనే ఉన్న మహదేవ్ ఆలయానికి చేరుకున్నారు. సాయంత్రం దేవుడి మందిరానికి అంతా చేరుకునేలోగా ప్రధాన తూము వద్ద కొంతభాగం గండిపడింది. మరో గంటకు కట్టపై ఉన్న రామస్వామి ఆలయం వద్ద ఇంకో గండి పడింది. రామస్వామి ఆలయం నీటిలోకొట్టుకుపోయింది.

తెగిన ఇలేగాం చెరువు...

సిరాల ప్రాజెక్టు నీటితో ఇలేగాం చెరువు తెగిపోయింది. దీంతో నీరంతా పంటపొలాల్లో ప్రవహించింది.


భైంసా/భైంసారూరల్: మృతిచెందిన గేదె

గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకూ వేలాది ఎకరాల పంట భూములు నీటిలో మునిగిపోయాయి. సిరాల ప్రాజెక్టు, ఇలేగాం చెరువు తెగిపోవడంతో బడ్‌గాం గ్రామ శివారుల్లోని రాజరాజేశ్వర రైస్‌మిల్ ప్రహరీ దెబ్బతింది. రైస్‌మిల్లు ఎదురుగా ఉన్న పశువుల పాక పూర్తిగా నీటమునిగింది. ఇందులో పనిచేసే ఏడుగురు వరదలో చిక్కుకోవడంతో భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, భైంసారూరల్ సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్, పట్టణ ఎస్సై శ్రీకాంత్‌లు రెస్క్యూటీంతో కలిసి రాత్రంతా పనిచేసి క్షేమంగా బయటకుతీసుకొచ్చారు. వరద ఉధృతికి 12 గేదెలు కొట్టుకుపోగా ఒక గేదె మృతిచెందింది. అలాగే 800 ఎకరాల్లో

అంతా బండరాళ్లే...

శుక్రవారం ఉదయం పంట పొలాల్లోకి వెళ్లి చూస్తే పెద్ద పెద్ద బండరాళ్లు, ఇసుకమేటలు కనిపించాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో 800 ఎకరాల భూములు నీటమునిగాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సిరాల చేరుకున్నారు.

కనుమరుగైన చరిత్ర....

1902లో సిరాల ప్రాజెక్టు నిర్మించారు. 121 ఏళ్ల కింద నిర్మించిన ఈ చెరువు ప్రధాన కట్టపైనే రామస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో రామస్వామి జీవసమాధి అయ్యాడు. సిరాల ప్రాజెక్టు అప్పట్లో అతి తక్కువ ఖర్చుతో రెండు గుట్టలను ఆనుకుని నిర్మించారు. ప్రాజెక్టు నిర్మించిన నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు మాత్రమే ఈ ప్రాజెక్టు ఎండిపోయింది.


భైంసా/భైంసారూరల్: సిరాలలో పర్యటిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


భైంసా/భైంసారూరల్: పంట పొలాల్లోకి బండరాళ్లు, ఇసుకమేటలు

కోత గురైన రోడ్లు


అందాకూర్ అలుగువద్ద కోతకు గురైన రోడ్డు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షంతో భారీ నష్టం వాటిల్లింది. కుంటాల–కల్లూర్ ప్రధాన రహదారిపై అందాకూర్ అలుగు వద్ద రోడ్డు కోతకు గురైంది. అందాకూర్ నుంచి పెంచికల్ పాడ్ వెళ్లే మార్గంలో తారురోడ్డు కోతగురై ఆనవాళ్లు కోల్పోయింది. మండలంలోని సుమారు 2,500 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

కదలని ఆర్టీసీ బస్సు..!


బస్టాండ్‌లో నిలిపిన ఆర్టీసీ బస్సులు

- ప్రధాన మార్గాల్లో తెగిన రోడ్లు
- నిలిచిన బస్సు సర్వీసులు, ఇబ్బందుల్లో ప్రయాణికులు
- భైంసా డిపోలో నీట మునిగిన కంప్యూటర్ రూం

భైంసాటౌన్: భైంసా డివిజన్ వ్యాప్తంగా కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ రోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ఆయా మార్గాల్లో అధికారులు వాహనాల రాకపోకలకు అనుమతించలేదు. భైంసా–నిర్మల్ రహదారిలో మాటేగాం వంతెన వద్ద రోడ్డు సగం వరకూ కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. భైంసా– నిజామాబాద్ మార్గంలో సైతం దేగాం వద్ద వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భైంసా ఆర్టీసీ డిపో నుంచి నిర్మల్, నిజామాబాద్ రూట్లలో బస్సు సర్వీసులు నిలిపేశారు. నాందేడ్ రూట్లో మాత్రమే బస్సులు నడిపారు. బస్టాండ్‌కు వచ్చిన ప్ర యాణికులు బస్సులు లేక ఇబ్బంది పడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేసినట్లు ప్రయాణికులు వాపోయారు.

కంప్యూటర్ గదిలోకి వరద..

భైంసాలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టుకు భారీగా వరద నీరు పోటెత్తడంతో ఏడు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలిన విషయం తెలిసిందే. దీంతో సుద్దవాగు పరీవాహక ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న భైంసా ఆర్టీసీ డిపోలోకి భారీగా వరద నీరు చేరింది. గతంలో వరదలు వచ్చినా ప్రహరీని ఆనుకుని నీరు ప్రవహించేది. ఈసారి డిపోను పూర్తిగా వరద నీరు ముంచెత్తడంతో డిపో కార్యాలయంలోని గదుల్లోకి నీరు ప్రవేశించి పరికరాలన్నీ దెబ్బతిన్నాయి. కంప్యూటర్ రూమ్‌లోకి నీరు చేరడంతో టిమ్ మెషిన్లు, టికెట్ పేపర్ రోల్, ఇతర సామగ్రి పూర్తిగా చెడిపోయాయి. గదుల్లో, రిపేర్ షెడ్డు బురదమయంగా మారడంతో అగ్నిమాపక సిబ్బంది సాయంతో బురద తొలగింపు చేపట్టారు. డిపోలోని ట్రాన్స్‌ఫార్మర్ పడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచింది. దీంతో టిమ్ మెషిన్లకు చార్జింగ్ లేక అవి పనిచేయకపోవడంతో సైతం బస్సు సర్వీసులు నిలిపివేసినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎం అమృతను వివరణ కోరగా ఆయా మార్గాల్లో రోడ్లు చెడిపోవడంతో సర్వీసులు నిలిపేసినట్లు తెలిపారు.


నీటికి కొట్టుకుపోయిన సామగ్రి తెస్తున్న సిబ్బంది


ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

గుట్టలు, వాగులు దాటి వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రాహుల్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చిచ్‌ధరి, ఖానాపూర్ సబ్‌సెంటర్ పరిధిలోని అల్లికోరి గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డుమార్గం లేదు. వర్షాకాలం కావడంతో ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం లేకపోలేదు. వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మండల వైద్యులు గుట్టలు, వాగులు, వంకలు దాటి శుక్రవారం అల్లికోరి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్యం అందజేశారు. వర్షాకాలంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అనారోగ్యానికి గురైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో ఆరోగ్య సహాయకులు పవార్ ప్రేమ్‌సింగ్, రాథోడ్ నారాయణ, సత్యవతి, శైలజ, ఎంఎల్‌హెచ్‌పీ కళ్యాణ్, ఆశాకార్యకర్త చంగునా బాయి ఉన్నారు. .

జలపాతానికి పర్యాటకులను అనుమతించొద్దు

బోథ్: మండలంలోని పొచ్చెర జలపాతాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలపాతానికి భారీగా వరద రావడంతో ఉధృతంగా ప్రవహిస్తోందని, సందర్శకులను జలపాతం వద్దకు అనుమతినివ్వద్దని ఫారెస్టు అధికారులకు ఆదేశించారు. భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ అతికోద్దిన్, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ ప్రకాష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి ప్రమోద్, ఎంపీవో జీవన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి ఉన్నారు.

నాడు.. నేడు




గోదావరి నది వరదలో మునిగిన ఉమామహేశ్వర ఆలయం

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి సమీపంలోని నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వరుడు బుధవారం ఉదయం వరకు భక్తులకు దర్శనమిచ్చాడు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకూ కురిసిన భారీ వర్షాలకు గోదావరి ఉధృతికి ఆలయం నీట మునిగింది. భారీ వర్షం కురవడంతో ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ చేరడంతో శుక్రవారం ఆలయం పూర్తిగా నీట మునిగింది. ఉమామహేశ్వరుడు నీటి నుంచి తేలి ఎప్పుడు దర్శనమిస్తాడోనని భక్తులు ఎదురుచూస్తున్నారు.

ఆదిలాబాద్‌కు హర్యానా పోలీసులు

- వివాహిత కోసం గాలింపు
- మహిళ మొబైల్ నంబర్ ట్రేస్ చేయడంతో ఇక్కడి లొకేషన్..


వన్‌టౌన్ సీఐకి వివరిస్తున్న హర్యానా పోలీసు

ఆదిలాబాద్‌టౌన్: హర్యాన పోలీసులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ వివాహిత కోసం గాలింపు చర్యలు చేపట్టడం హైరానాకు గురిచేసింది. వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట ఆదిలాబాద్ పట్టణానికి చెందిన యువకులు, బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకులు గుమిగూడడంతో పట్టణ ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. హర్యాన పోలీసులు, బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. హర్యానకు చెందిన ఓ కుటుంబం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆ కుటుంబ యజమాని ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌లో ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. పట్టణంలోని ఓ కూడలిలోని జిమ్‌లో ఆయన భార్య ఆరు నెలల క్రితం వ్యాయామం కోసం చేరగా అతడితో వివాహేతర సంబంధం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం ఆ ఉద్యోగికి తెలియడంతో భార్యను తన సొంత ఊరికి తీసుకెళ్లి అక్కడ ఉంచాడు. రెండుమూడు రోజుల క్రితం భార్య కనిపించకుండా పోయింది. దీంతో హర్యానా రాష్ట్రంలో మిస్సింగ్ కేసు నమోదైంది. ఆమె ఫోన్ ట్రేస్ చేయడంతో ఆదిలాబాద్‌లో ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. శుక్రవారం హర్యాన పోలీసులతో పాటు బాధిత కుటుంబీకులు ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. స్థానికంగా ఉన్న జిమ్ యజమానిపై ఆరా తీయగా అందుబాటులో లేడనే తెలిసింది. ఇదిలా ఉండగా హిందూ సంఘాల నాయకులు జిమ్ యజమానిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. వివాహిత అదృశ్యమైన కేసు దర్యాప్తు కోసం ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.